# మాడపాటి హనుమంతరావు సాహిత్యం - వ్యక్తిత్వం

డా. జి. అరుణ కుమారి

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్.

తెలంగాణా ప్రజల హక్కుల కోసం, అభ్యుదయం కోసం, తెలుగు భాషాభివృద్ధి కోసం కృషి చేసిన ఆంధ్ర పితామహుడు శ్రీ మాడపాటి హనుమంతరావు గారు. 'పద్మభూషణ్' బిరుదునందుకున్న తెలుగువారిలో వీరు ప్రథములు. వీరిని 'హైదరాబాద్ గోఖలే' అని వ్యవహరించేవారు.

హనుమంతరావు దేశభక్తుడు, సాంఘిక సేవానురక్తుడు, ఆంధ్రభాషోద్యమం, సంఘ సంస్కరణోద్యమం, రాజకీయోద్యమం వీరిని ప్రభావితం చేశాయి. గోపాలకృష్ణ గోఖలే, బాలగంగాధరతిలక్, ఫిరోజ్ షా మెహతా వంటి నాయకుల రాజకీయ చైతన్యం, కందుకూరి వీరేశలింగం పంతులు, కొమర్రాజు లక్షణరావు వంటి సంస్కర్తల సాంఘిక, సాంస్కృతిక చైతన్యం వీరిలో ఉద్యమస్ఫూర్తిని, సాహిత్యాభిలాషను కలిగించాయి.

ఏకేశ్వరోపాసన, వర్ణాంతర వివాహాలు, వర్ణ వ్యవస్థ నిర్మూలన, స్త్రీ విద్య, సంఘ దురాచారాలను రూపుమాపడం, మతసహనం వంటి సమస్యలపై నిర్విరామ కృషి చేసి తమ సాంఘిక సేవాపరాయణతను, దేశభక్తిని నిరూపించుకున్నారు. బాల్య వివాహాలను నిషేధించడం, మద్యపాన నిరసన, ఆరోగ్యం రక్షణ, శారీరక విద్య, వేశ్యావృత్తి నిరసన, స్త్రీలకు ఆస్తిహక్కు, బాలికలకు మాతృభాష ద్వారా విద్యా లాభం, రైతుల బాధలు, ఋణవిముక్తి వంటి ఆంధ్ర మహాసభల తీర్మానాలకు మాడపాటి హనుమంతరావు ప్రోత్సాహం కనిపిస్తుంది. 1930 నుండి 1946 వరకు జరిగిన పదమూడు మహాసభల మూలంగా తెలంగాణా ఆంధ్రోద్యమాన్ని నడిపి ఆంధ్రజాతిలో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక చైతన్యాన్ని కలిగించారు. ఆంధ్రోద్యమం కారణంగా ప్రజలు తెలుగులో మాట్లాడటం, ఉపన్యాసాలివ్వటం, పత్రికలకు కథలు, వ్యాసాలు, కవితలు రాయడం వలన ప్రజలలో

సామాజిక స్పృహను కలిగించారు. ఆంధ్రభాష మూలంగా విజ్ఞానవ్యాప్తి, ఆంధ్రనిధిని సమకూర్చటం, చారిత్రక శిధిలాలను కాపాడటం, వెట్టిచాకిరి, నిర్బంధ ప్రారంభవిద్య వంటి ఉద్దేశ్యాలను ఆంధ్ర మహాసభల ద్వారా వ్యాపింపచేయడానికి తెలంగాణ ప్రజాహితోద్యమాలకు చేయూతనిచ్చారు. వర్తక స్వాతంత్ర్యం, వాక్ స్వాతంత్ర్యం, గ్రంథాలయాలు, పుస్తక ప్రచురణ వంటి సంస్కరణ కార్యక్రమాలను చేపట్టారు. వీరు 1951లో నగర పురపాలక సంఘానికి ప్రథమ మేయరుగా, 1958లో శాసనమండలి ఛైర్మన్‌గా పనిచేశారు. ఆది హిందూ సాంఘిక సేవాసమితి కార్యకర్తగా నిమ్న జాతి విద్యావ్యాప్తి కోసం జీవితాన్ని అంకితం చేశారు. ఆంధ్ర జన సంఘ కార్యదర్శిగా నిలిచి ఆంధ్రోద్యమానికి పాటుపడ్డారు.

ఇంగ్లీషు, ఉర్దూ, మరాఠీ భాషలలో ఉపన్యసించే వారికుండే గౌరవం తెలుగులో ఉపన్యసించే వ్యక్తులకు ఉండేది కాదు. ఇది తెలుగుభాషకు, తెలుగు ప్రజలకు జరిగిన అవమానంగా ఎంచి తెలుగు భాష ప్రాధాన్యాన్ని గుర్తించి పత్రికల మూలంగా, గ్రంథాలయాలమూలంగా, విద్యాసంస్థల మూలంగా, గ్రంథ ప్రచరణల మూలంగా ప్రజలను చైతన్యవంతులను చేయడానికి హనుమంతరావు కృషి చేశారు.

తెనుగు, నీలగిరి, గోలకొండ, సుజాత, తెలంగాణ పత్రికలలో ఆంధ్రోద్యమానికి స్ఫూర్తినిచ్చే సంపాదకీయ వ్యాసాలు రాశారు. జాతి పునరుద్ధరణ కోసం కథలు, వ్యాసాలు, సంపాదకీయ వ్యాసాలు, గ్రంథాలు రచించారు.

హనుమంతరావుగారు ట్రస్టును నియమించి ఆంధ్ర చంద్రికా గ్రంథమండలిని స్థాపించి ఆంధ్రభాషకు పుష్టి కలిగించే గ్రంథాలను ప్రచురించారు. వీరి సహకారంతో నెలకొన్న సంస్థలు లక్ష్మణరాయ పరిశోధన మండలి, ఆంధ్ర చంద్రికా గ్రంథమాల, విజ్ఞానవర్ధిని పరిషత్తు, రాజరాజనరేంద్ర భాషా నిలయం, వేమనాంధ్ర భాషా నిలయం, బాలసరస్వతీ గ్రంథాలయం, ఆంధ్రబాలికా పాఠశాల గ్రంథాలయం, రాజా బహద్దూర్ వెంకట రామారెడ్డి కళాశాల గ్రంథాలయాలే కాకుండా వీటితో పాటు వందకు పైగా

గ్రంథాలయాల స్థాపనకు కృషి చేశారు. హనుమంతరావుగారి నిర్విరామ కృషి వలన శ్రీ రాజా బహద్దుర్ వెంకట రామారెడ్డి గారి సహాయ సహకారాలతో హైదరాబాదులో నారాయణగూడలో బాలికోన్నత పాఠశాల అభివృద్ధి చెందింది. ఉర్దూ తప్ప ఇతర భాషలను బోధనాభాషగా ఉస్మానియా విశ్వవిద్యాలయం అంగీకరించకపోవడం వలన పూనాలోని శ్రీమతి నాతీబాయి దామోదర్ థాక్ర్సే భారత మహిళా విశ్వవిద్యాలయంవారు ఈ పాఠశాలను గుర్తించారు.

మహిళా సభలు కూడా ఆంధ్రోద్యమానికి బలాన్నిచ్చాయి. స్త్రీలు బహిరంగ సభలకు రావడాన్ని ప్రోత్సహించారు. మాడపాటి హనుమంతరావు గారి భార్య మాణిక్యాంబ నాలుగవ ఆంధ్ర మహాసభకు అధ్యక్షత వహించారు. స్త్రీ అభ్యుదయంలో బహుభార్యత్వాన్ని, కన్యాశుల్కాన్ని, వేశ్యావృత్తిని నిరసించారు. స్త్రీలకు విద్య, ఆర్థిక స్వాతంత్ర్యం అవసరమని శాసనసభలలో స్త్రీలకు ప్రాముఖ్యం ఉండాలని గుర్తించారు. వితంతు వివాహాలను ప్రోత్సహించారు. కులాంతర వివాహాలకు అడ్డు చెప్పలేదు. రాజనీతి, సంస్కరణ, స్త్రీ విద్య, చరిత్ర, భాష, సాహిత్యం మొదలైన అన్ని రంగాలలో ఆయన కృషి చేశారు.

హనుమంతరావు గారి భాషా నిరతికి అడవి బాపిరాజు, కాళోజీ, చలమచర్ల రంగాచార్యులు 'గీతావళి' అనే శీర్షికతో హనుమంతరావుగారిపై పద్యాలు రాశారు. తెలంగాణా ప్రజల స్థితిని గురించి, మాడపాటి వారి పాత్రను గురించి రాశారు.

"తెలుగు తనము తమకే లేదని
తెలుగు భాషాతనం తమదే కాదని
తెలుగు వారూ తామే కామని
తెలంగాణమూ మత్తులో వుంటే
మంత్రపు కట్టా తిప్పారండీ
మాడపాటి వారు" (తెలుగువీర గాథ, ఆంధ్ర పితామహ హనుమంతరాయ షష్టిపూర్తి సంచిక, పు -317)

హనుమంతరావుగారికి భాషాభిమానం మెండుగా ఉండేది. పరభాషాపదం ఉపయోగించకుండా ఉపన్యసించేవారు. బంకించంద్ర ఛటర్జీ రాసిన 'ఆనందమఠ్' నవలను తెలుగులో అనువదించారు. గారిబాల్డీ జీవిత చరిత్రను, రోమన్ సామ్రాజ్య చరిత్రము అనే గ్రంథాలను రచించారు. కానీ ఈ మూడు అముద్రితాలుగానే నిలిచిపోయాయి. 'క్షాత్రకాలపు హింద్వార్యులు' 'నిజాం రాష్ట్రంలో రాజ్యాంగ సంస్కరణలు' అనే గ్రంథాలను ఆంగ్లం నుండి తెలుగులో అనువదించారు. వీరి రచనలలో పేర్కొనదగినది 'తెలంగాణా ఆంధ్రోద్యమము'.

ఆదిరాజు వీరభద్రరావు గారు హనుమంతరావు గారిని 'తొలి తెలుగు కథానిక రచయిత'గా గుర్తించారు. హనుమంతరావుగారు మల్లికాగుచ్ఛము అనే కథల సంపుటిలో 7 కథలు, మాలతీగుచ్ఛములో రెండు కథలు, ఎవరిది తప్పు అనే కథతో పాటు 10 కథలున్నాయి. ఇందులో ఐదు చారిత్రక కథలు, ఐదు సాంఘిక కథలు. వీటిలో రెండు స్వతంత్ర రచనలు, మిగిలినవి ప్రేమ్‌చంద్ ఉర్దూ కథలకు స్వతంత్ర అనువాదాలు.

హనుమంతరావుగారి కథలలోని స్త్రీ పాత్రలు పురుష పాత్రలకన్నా ఉదాత్తంగా కనిపిస్తాయి. 'ఎవరిది తప్పు' అనే కథలో మాత్రం జ్యోతిష్య శాస్త్రంలో మూఢ నమ్మకం ఉన్న స్త్రీ మనస్తత్వం, ఆలోచనలు, దాని వలన కలిగిన అనర్థాలను తెలియచేశారు. అనుకూలమైన ఆలోచనలే వ్యక్తికి బలాన్ని చేకూర్చుతాయనే సత్యాన్ని నిరూపించారు. ప్రతికూలమైన ఆలోచనలు బలహీన మనస్తత్వానికి అద్దం పడతాయి. మిగిలిన కథలలోని స్త్రీ పాత్రలు మనోధైర్యం, సాహసం, ఆత్మగౌరవం గల పాత్రలే.

ధర్మం కోసం అన్న తమ్ముణ్ణి హతమార్చవచ్చు (అగ్నికుండము), అనుమానంతోనూ హతమార్చవచ్చు (విధి ప్రేరణము), ధనాశ చేత న్యాయవాది ధర్మాన్ని తప్పవచ్చు (ముసలిదాని యుసురు), నిమ్నజాతి ఉద్ధరణ కోసం భార్య మనసును నొప్పించనూ వచ్చు(నాడు నీ పంతము - నేడు నా పంతము), మంచి చెడులు ఒకే నాణానికి రెండు ముఖాలైనట్లు మానవునిలో అనుమానం ఎంతకైనా దారితీస్తుంది అనే సత్యాన్ని

హృదయశల్యం, విధి ప్రేరణ వంటి చారిత్రక కథలలో తెలియచేశారు. క్షత్రియ ధర్మం ప్రధానమని రాణీ సారంధా, ఆత్మార్పణము కథలలో నిరూపించారు.

రేఖామాత్రంగా కనిపించే కథావస్తువును ఒక కథగా మలచి పాఠకుల చేత చదివింపచేయడం విశేషం. స్త్రీ పురుష మనస్తత్త్వ పరిశీలన సందర్భంలో రచయిత మనోభావాలు, రచయిత కాలం నాటి సమాజం మన కళ్ళెదుట ప్రత్యక్షమవుతాయి. స్వేచ్ఛానువాద పద్ధతిలో కథలను అనువదించడం వలన అనువాద కథలనే తలంపు కలుగదు. కథలలో మాడపాటి వారి హృదయం అడుగడుగునా తొంగి చూస్తుంది.

మాడపాటి హనుమంతరావుగారికి స్త్రీల పట్ల ఎనలేని గౌరవం ఉందనే భావం కథల్లోనూ కనిపిస్తుంది. స్త్రీలు మృదుస్వభావులని, అనురాగానికి ఉనికి పట్టని, ఆలోచనా శక్తిగలవారని, ధైర్య సాహసాలు గలవారని వివరిస్తూనే స్త్రీలు చిత్త స్థైర్యంలేని వారని, జంకుగలవారని చెప్పటం కూడా కనిపిస్తుంది.

సాంఘిక కర్తవ్యం కోసం బలవ్వటం అమానుషం అని భావించి సంఘం పట్ల కర్తవ్యం ఏమిటో తెలియని వారిని మానవ నామంతో వ్యవహరించడం పొరపాటని వివరించారు. స్త్రీ పురుషులకు సమాజం పట్ల సమాన ధర్మం, బాధ్యత ఉందని ఆశించారు. సమాజ పురోగతికి సాహిత్యం సాధనమని ఎంచి దాని మూలంగా రాజకీయ సామాజిక చైతన్యాన్ని కలిగించే ప్రయత్నం చేశారు. జాతీయ సమైక్యతా భావం, సంఘ సంస్కరణ దృక్పథం, ఆంధ్రుల సంస్కృతి పట్ల అభిమానం, భాషాభిమానం, సాహిత్యాభిరుచి మాడపాటి హనుమంతరావు గారి వ్యక్తిత్వానికి నిదర్శనాలు. బహుముఖత్వం గల మాడపాటి వారి సాహిత్యంలో ప్రతిఫలించేది తెలుగు ప్రజల జీవనాడి.

*(Madapati Hanumantha Rao*
*Madapati Hanumantha Rao Girls' High School*
*Platinum - Jubilee Souvenir*
*P. 107-109)*